## భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం




-భూ సమస్యలు లేని గ్రామాలే మా లక్ష్యం
-రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసమే జిపివోల నియామకం
-తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి

# ప్రజారోగ్యంతో చెలగాటం



-ఎస్‌టిపి వ్యవస్థకు తిలోదకాలు
-ధనార్జనే ధ్యేయంగా ఆసుపత్రుల నిర్వహణ
-నిద్రావస్థలో అధికార యంత్రాంగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఆసుపత్రుల యజమాన్యాలు కొన్ని ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్నాయి. ఆసుపత్రులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిద్రావస్థలో ఉండడంతో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఆసుపత్రుల నుంచి వచ్చే వ్యర్థ జలాలు నేరుగా డ్రైనేజీల్లో కలుస్తున్నాయి. తద్వారా ప్రజలు వివిధ వ్యాధులకు గురవుతున్నారు. ఆసుపత్రులకు అనుమతి ఇచ్చే ముందు ఎస్‌టిపి (మురుగునీటి శుద్ధి కర్మాగారం) ఉంటేనే అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది లేకపోతే ఆసుపత్రులకు అనుమతి ఇవ్వకూడదన్న నిబంధన ఉంది. కానీ చాలా ఆసుపత్రులు అనుమతులు పొందే సమయంలో ఎస్‌టిపిని ఏర్పాటు చేయడం ఆ తర్వాత నిర్వహణను పట్టించుకోకుండా గాలికి వదిలేస్తున్నారు. ఆసుపత్రుల్లో వాడుతున్న వ్యర్థ జలమంతా శుద్ధి కాకుండానే నేరుగా డ్రైనేజీలోకి చేరుతుంది. దీని ప్రభావం ప్రత్యక్షంగా పలు వ్యాధులకు కారణమవుతుంది. ప్రతి నెల వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఖచ్చితంగా ఎస్‌టిపిలను పరిశీలించాల్సి ఉంటుంది. కారణం ఏమిటో కాని వైద్య ఆరోగ్యశాఖాధికారులు ఆ విషయాన్ని మరిచిపోతున్నారు. కొన్ని ఆసుపత్రులు ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్నాయి. రోగుల రాక కోసం వారు ఆర్‌ఎంపిలకు, పిఆర్‌వోలకు ప్రకటిస్తున్న నజరానాలు రోగుల పాలిట శాపాలుగా మారాయి. రోగం వచ్చిందంటే ఆస్తులు అమ్మితే తప్ప

మిగతా 2లో..

## సంక్షేమ పథకాల్లో 'సన్నబియ్యం' కీలకం



-అవినీతి, అక్రమాలకు తావులేకుండా పథకం కొనసాగించాలి
-కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని

వివరాలు 2లో..

## పౌష్టికాహారం అందించేందుకు సన్నబియ్యం పంపిణీ

మేయర్ పునుకొల్లు నీరజ



2లో

## రామభక్తులకు సకల సౌకర్యాలు



**ప్రజాపక్షం/భద్రాచలం:** శ్రీ సీతారామ నవమిని పురస్కరించుకుని రామభక్తుల కోసం సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు జిల్లా కలెక్టర జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఆయన రామాలయ పరిసరాల్లో గల మిథిలా స్టేడియంలో జరుగుతున్న పనులను ఐటిడిఏ పిఓ రాహుల్, ఎస్‌పి రోహిత్ రాజ్, ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలన్నీ దృష్టిలో పెట్టుకుని మొట్టమొదటి సారిగా మిస్ట్ ఫాగింగ్ (పొగమంచు) ఏరాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిఐపి, విఐపి, భక్తులు కూర్చునే

- వేసవి ఉపశమనానికి తొలిసారిగా మిస్ట్‌ఫాగ్ ఏర్పాటు
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్,పిఓ
- పనులు త్వరగా పూర్తి చేయాలి
- కలెక్టర్ జితేష్ వి పాటిల్

స్వామివారి కళ్యాణాన్ని తలకించేందుక సెక్టార్ల వారీగా ఏర్పాటు చేయాలన్నారు. కళ్యాణం, పట్టాభిషేకాన్ని ముగించుకుని

మిగతా 2లో..

# ప్రజారోగ్యంతో చెలగాటం

(మొదటిపేజీ తరువాయి)

నయం కాని పరిస్థితి ఏర్పడింది. 20 నుంచి 30 శాతం కమిషన్ దాటి ఇప్పుడు 50 శాతం కమిషన్‌కు చేరిపోయిందట. 50 శాతం కమిషన్ ఇవ్వడంతో పాటు తమ ఆసుపత్రి నిర్వహణ, లాభాలను దృష్టిలో ఉంచుకుని రోగి వద్ద నుంచి సాధారణంగా అయ్యే ఖర్చు కంటే మూడు రేట్లు అదనంగా వసూలు చేస్తున్నారు. ఖమ్మంలో రెండు మూడు ఆసుపత్రులు మినహా మిగిలిన వారంతా ఆర్‌ఎంపిల సేవలో తరిస్తూ కాకులు కొట్టి గద్దలకు వేసినట్లు రోగుల వద్ద దోచుకుని ఆర్‌ఎంపిలకు దోచిపెడుతున్నారు. వైద్యానికి సరిపడ డబ్బులు వచ్చిన ఆర్‌ఎంపికి ఇవ్వాల్సిన కమిషన్ సరిపడ రాలేదని మృతదేహాన్ని పది గంటల పాటు ఆసుపత్రిలోనే ఉంచుకుని చివరకు శోకసంద్రంలో ఉన్న మృతుని కుటుంబ సభ్యుల వద్ద నుంచి డబ్బులు పిండి కాని మృతదేహాన్ని అప్పగించలేదంటే ఆసుపత్రుల్లో ఎంతటి అమానవీయ ఘటనలు చోటు చేసుకుంటున్నాయో ఆలోచించాల్సిన అవసరం ఉంది. అవసరం లేని చోట ఆర్‌ఎంపి చెప్పాడని ఆపరేషన్, ఆర్‌ఎంపి చెప్పాడని మూడు రోజులు ఆసుపత్రిలో ఉంచుకోవడం అవసరం లేకపోయినా ఐసియుకి రిఫర్ చేయడం ఇవ్వన్ని రోగిని పరీక్షించిన వైద్యులు నిర్ణయించడం లేదు.



ఆర్‌ఎంపి వ్యవస్థ మొత్తం వైద్య రంగాన్ని శాసిస్తుంది. కాసుల కోసం కక్కుర్తిపడుతున్న ఆసుపత్రుల యజమాన్యాలు కనీసం మానవత్వం లేకుండా రోగం వచ్చిందంటే ఎలా డబ్బులు పిండాలో ఆర్‌ఎంపి చెబుతుంటే అదే పంథాను ఆసుపత్రులు అవలంభిస్తున్నాయి. రోగులారా తస్మాత్ జాగ్రత్త. వారితో వచ్చారా ఆస్తులు అమ్ముకోవాల్సిందే.

# సంక్షేమ పథకాల్లో 'సన్నబియ్యం' కీలకం

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల్లో సన్న బియ్యం పంపిణి పథకం కీలకంగా మారనుందని, పేద కుటుంబాల ఆకలితీర్చే ఈ పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సాహసమేనని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు రామాటాకీస్ ఏరియా, చుంచుపల్లి మండలంలోని రాంనగర్, సుజాతనగర్లో రేషన్ షాపుల్లో సన్నబియ్యం పథకాన్ని కూనంనేని ప్రారంభించి మాట్లాడారు. గత పాలకుల సన్న బియ్యం పథకం అమలు ప్రకటనకు పరిమితమైందన్న విషయాన్ని గుర్తుచేశారు. ఇతర రాష్ట్రాలకు ఈ పథకం ఆదర్శమని అన్నారు. ప్రజల ఆరోగ్యానికి, పోషకాహార భద్రతకు ఈ పథకం దోహదపడుతుందని, ఈ పంపిణీ కార్యక్రమాన్ని పేదవర్గాల సద్వినియోగం చేసుకోవాలని కోరుకుంటున్నాను. పథకాన్ని ఎలాంటి అవినీతి, అక్రమాలకూ తావులేకుండా పకడ్బందీగా కొనసాగించాలని, సంబంధిత అధికారులు నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. పేదల బియ్యం పక్కదారి పడితే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ నాగసీతారాములు, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి రుక్మిణీదేవి, సివిల్ సప్లైస్ డిఎం త్రినాధ్, సీల్దార్లు పుల్లయ్య, కృష్ణ, శిరీష, డిటి మహేష్, స్థానికులు వాసిరెడ్డి మురళి, భూక్యా దస్రు, భాగం మహేశ్వర్



రావు, జక్కుల రాములు, కొమారి హన్మంతరావు, కంచర్ల జమలయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, నేరెళ్ల శ్రీనివాస్, భూక్యా శ్రీనివాస్, ధర్మరాజు, యూసుఫ్, బోయిన విజయ్ కుమార్, సత్యనారాయణ చారి, సుధాకర్, దుర్గ, యాలాద్రి, యాకుబ్, యాసిన్, వేణు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందించేందుకు సన్నబియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని మేయర్ పునుకొల్లు నీరజ తెలిపారు. మంగళవారం ఖమ్మం నగరంలోని చర్చి కాంపౌండ్ ప్రాంతంలో ఉన్న రేషన్ దుకాణం వద్ద లబ్దిదారులకు సన్న బియ్యం పంపిణీని మేయర్ పునుకొల్లు నీరజ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం రేషన్ షాపుల ద్వారా దొడ్డు రకం బియ్యం సరఫరా చేస్తుండడంతో అవి దళారుల పాలవుతున్నాయని తెలిపారు. ప్రజలకు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు ధనవంతులు తినే సన్న బియ్యాన్ని పేదలకు పంపిణీ చేయాలని నిర్ణయించిందన్నారు. అందులో భాగంగానే నేటి నుంచి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తుందని ఆమె తెలిపారు. ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా పౌర సరఫరాల అధికారి చందన్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన సన్న బియ్యం పంపిణీని ఖమ్మంజిల్లాలోని 748 చౌక దుకాణాల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు ఈ సన్నబియ్యాన్ని వినియోగించుకోవాలన్నారు. జిల్లాలోని ఏ చౌక దుకాణం నుండైనా పోర్టబిలిటి ద్వారా రేషన్ కార్డు దారులు సన్నబియ్యాన్ని తీసుకోవచ్చునని తెలిపారు. గత ఖరీఫ్ (వానాకాలం) 2024 25 సీజన్ నందు ఖమ్మంజిల్లాలో 51312 మంది రైతుల వద్ద నుంచి 295608 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అందులో సన్న రకం ధాన్యం 272674 మెట్రిక్ టన్నులను 47494 మంది రైతులకు బోనస్ రూపంలో రూ.136333000 కోట్లను బోనస్ రూపంలో రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డిటి విజయ్‌బాబు, ఆర్‌ఐ వహిద్, లబ్దిదారులు తదితరులు పాల్గొన్నారు.

# పెద్దతండాలో సన్న బియ్యం పంపిణీ

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న రేషన్ బియ్యాని.. ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని పెద్దతండలో మంగళవారం పంపిణీ చేశారు. దీనికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంప్ కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా..హాజరయ్యి లబ్దిదారులకు అందజేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంప్రసాద్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, మద్దులపల్లి మార్కెట్ కమిటీ ఛైర్మన్ బైరు హరినాథ్‌బాబు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మద్ది మల్లారెడ్డి, ధరావత్ రామ్మూర్తి నాయక్, మద్ది కిషోర్‌రెడ్డి, తిప్పని రాజశేఖర్‌రెడ్డి, అజ్మీర అశోక్‌నాయక్, భూక్య సురేష్‌నాయక్, మండల అధ్యక్షులు కళ్లెం వెంకట్‌రెడ్డి, నాయకులు భూక్య కిషోర్‌నాయక్, బానోత్ హరినాయక్, కందుకూరి వెంకటనారా



యణ, మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పంతుల్‌నాయక్, కర్లపూడి సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

# రామభక్తులకు సకల సౌకర్యాలు

(మొదటిపేజీ తరువాయి)

భక్తులు సంతోషంగా తిరిగి వెళ్లేలా ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత మనదే అన్నారు. మంచినీరు, మజ్జిక ప్యాకెట్లను భక్తులు అందించాలని, ఇందు కోసం స్వచ్ఛంద సంస్థల సహకారాన్ని తీసుకోవాలని చెప్పారు. ప్రధానంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, ఇందు కోసం గ్రామపంచాయితీతో పాటు ఇతర సిబ్బంది కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తాత్కాలిక మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునే కదులు, టెంట్లు, సేదతీరే సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. ప్రసాదాలు, తలంబ్రాలు అందరికీ అందేలా అదనపు కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా గోదావరి తీరంలో జాగ్రత్తలు పాటించాలని, పోలీస్ బందు బస్తు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవి, ఆర్డిఓ దామోదర్ రావు, తహశిల్దార్ శ్రీనివాస్‌తో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ బాధ్యతలు స్వీకరణ




**ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ :** మార్చి 27న జరిగిన ఖమ్మం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన బార్ అసోసియేషన్ కార్యవర్గం మంగళవారం బాధ్యతలు స్వీకరించింది. అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన తొండపు వెంకటేశ్వరరావు, గద్దల దిలీప్‌కుమార్ సహా మొత్తం కార్యవర్గం బాధ్యతలు స్వీకరించింది. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఖమ్మం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని న్యాయవాదుల సంక్షేమమే ఎజెండాగా పనిచేస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామని బార్ అసోసియేషన్ బెంచ్ మధ్య సత్సంబంధాలను కొనసాగిస్తామన్నారు. బాధ్యతలు స్వీకరించిన వారిలో ఉపాధ్యక్షురాలిగా మోత్కూరి విజయశాంత, కార్యదర్శిగా గద్దల దిలీప్‌కుమార్, సహాయ కార్యదర్శిగా మేకల నవీన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్. రాంబాబు, క్రీడల కార్యదర్శిగా కెవివి లక్ష్మి, కోశాధికారిగా నర్సింహారావు, మహిళా ప్రతినిధిగా ఇందిర లు బాధ్యతలు స్వీకరించారు. గతంలో బార్ అసోసియేషన్ బాధ్యతలు నిర్వహించిన వారు మంగళవారం నూతన కార్యవర్గానికి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

## -ఎఎంసి ఛైర్మన్ యరగర్ల



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన సన్నబియ్యం పథకాన్ని మంగళవారం రఘునాథపాలెం మండల పరిధిలోని వి.వెంకటాయపాలెం గ్రామంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రజలకు అందించాలని ప్రభుత్వం సన్న బియ్యం పథకానికి శ్రీకారం చుట్టిందన్నారు. పేదలు సన్నబియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పేదలకు సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు బానోత్ కిషోర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిలారు వెంకటరమణ, దరావత్ వీరు, బానోత్ కృష్ణ, రాము, మాజీ ఎంపిటిసి సత్యనారాయణ, తగరం ఆదామ్, నల్లగట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# భూముల వేలం ఆలోచనను వెనక్కి తీసుకోవాలి




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయాలనే ఆలోచనను ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి టి. ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని నిర్మల్ హృదయ్ స్కూల్ సమీపంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల భూమిని వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామన్నారు. కార్పొరేట్ శక్తులకు భూములు అమ్మిన ప్రభుత్వం హెచ్‌సియు భూములను అమ్మేందుకు అక్కడ అడవులను చదును చేయాలనే పేరుతో బుల్డోజర్లు, జేసిబిలతో చెట్లను తొలగించే కార్యక్రమం చేపట్టిందన్నారు. అడ్డుకున్న విద్యార్థి నాయకులను అక్రమంగా అరెస్టు చేసిందన్నారు. పోలీస్ బలగాలతో యూనివర్సిటీని నిర్బంధించడం వంటి సంఘటనలకు నిరసనగా శాంతియుత కార్యక్రమాలకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపునిస్తే పోలీసులు అర్థరాత్రి జిల్లాలో ఎస్ఎఫ్ఐ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం దుర్మార్గపు చర్య అన్నారు. భూముల వేలం ఆలోచనను ప్రభుత్వం వెంటన వెనక్కి తీసుకోవాలని, అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు సుధాకర్, ఉపాధ్యక్షులు రాజు, జిల్లా నాయకులు వినోద్, వినయ్, మనోజ్, లోకేష్, వెంకటేష్, త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీవ్ యువ వికాసం గడువు పొడిగింపు

**-కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** రాజీవ్ యువ వికాసం పథకం క్రింద దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 14 వరకు గడువు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. నిరుద్యోగ యువతపై పెద్ద మొత్తంలో ప్రభుత్వం నిధులు ఖర్చు చేస్తూ రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు. ఎస్సి, ఎస్టి, బిసి, ఈబిసి, మైనార్టీ యువకులకు సంబంధిత కార్పోరేషన్ల ద్వారా వంద శాతం సబ్సిడీపై 50వేల యూనిట్, 90 శాతం సబ్సిడీపై లక్ష రూపాయల యూనిట్, 80 శాతం సబ్సిడీతో రెండు లక్షల రూపాయల యూనిట్, 70 శాతం సబ్సిడీతో నాలుగు లక్షల వరకు యూనిట్లను యువకులు ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందన్నారు. చిన్ననీటి పారుదల రంగంలో యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి వంద శాతం సబ్సిడీ, దుర్బల సమూహాలకు లక్ష రూపాయల వరకు 90శాతం సబ్సిడీ ప్రత్యేకంగా ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. రాజీవ్ యువ వికాసం పథకం పొందెందుకు గ్రామీణ ప్రాంతాల్లో వార్షిక ఆదాయ పరిమితి రూ.1.50 లక్షల లోపు, పట్టణ ప్రాంతాలలో రెండు లక్షల లోపు ఉండాలని తెల్ల రేషన్ కార్డులో దరఖాస్తుదారుని పేరు లేని పక్షంలో మాత్రమే ఆదాయ సర్టిఫికెట్ సమర్పించాలని కలెక్టర్ తెలిపారు. వ్యవసాయోతర పథకాలకు అభ్యర్థుల వయస్సు 21 నుంచి 55 ఏళ్ల మధ్యలో ఉండాలని వ్యవసాయ అనుబంధ రంగాల యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి 60 సంవత్సరాల వరకు సడలింపు ఇవ్వడం జరిగిందన్నారు. ఐదేండ్లకు కుటుంబం నుంచి ఒకరికి మాత్రమే ఉపాధి పథకం మంజూరు చేయడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఆదాయ ధృవీకరణ పత్రం, రవాణా రంగ పథకాలకు శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్, వ్యవసాయ పథకాలకు పట్టాదారు పాసుపుస్తకం, దివ్యాంగుల సదరం సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫోటో, దుర్బల సమూహ ధృవీకరణ మండల శాఖ కమిటీ ద్వారా జారీ చేసిన పత్రంతో పాటు ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు చేయాలన్నారు. లబ్దిదారులను ఎంపిక చేసిన తర్వాత వారికి మంజూరు పత్రాలు జారీ చేయడంతో పాటు యూనిట్ గ్రౌండింగ్, వ్యాపార నిర్వహణలో పాటించాల్సిన సూత్రాలపై శిక్షణ అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల యువకులు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

# పిఆర్‌టియు ఆధ్వర్యంలో పాదయాత్ర



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా గెలుపొందిన పింగళి శ్రీపాల్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ పిఆర్‌టియు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. మంగళవారం పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు యలమద్ది వెంకటేశ్వర్లు (వైవి) ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్‌లో ఉన్న వినాయక స్వామి దేవాలయం నుండి వైరా పట్టణంలోని పాత శివాలయం వరకు 23 మంది సభ్యులతో కూడిన బృందం పాదయాత్ర ద్వారా చేరుకున్నారు. ఈ బృందానికి వైరా మండల పిఆర్‌టియు అధ్యక్షులు వెలిశెట్టి నర్సింహారావు ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం శివాలయంలో ఎంఎల్‌సి పింగళి శ్రీపాల్‌రెడ్డి పేరు మీద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా వైరా రిజార్వాయర్ సమీపాన గల దాసాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీతారామయ్య, కుసుమ నాగేశ్వరరావు, టి. సురేష్, వేముల భిక్షం, పి. శ్రీనివాసరెడ్డి, లింగం సతీష్, రత్నకుమార్, కెవి రమణ, జివి రమణ, కె. రాము, పాటి వెంకటేశ్వర్లు, టి. వెంకన్న, కె. గోపాలరావు, జి. రామారావు, కెవి నాయుడు, టి. రాఘవయ్య, పి. వెంకటరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మా యూనివర్సిటీ భూములు అమ్ముకోవద్దు

**హెచ్‌సియు స్కూల్ విద్యార్థినిలు భాస్కర్ణి యశస్వి, ఝూనవి**





**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మా యూనివర్సిటీ భూములు అమ్ముకోవద్దంటూ ప్లకార్డులు ప్రదర్శించటమే కాకుండా, రిలే దీక్షలో సైతం పాల్గొని ఔరా అనిపించారు వేంసూరు మండలం మర్లపాడుకు చెందిన భాస్కర్ణి యశస్వి, ఝూనవిలు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ క్యాంపస్ స్కూల్లో చదువుతున్న భాస్కర్ణి యశస్వి, ఝూనవిలు యూనివర్సిటీ భుముల రక్షణలో మేము సైతం అంటూ చెయ్యి కలుపుతున్నారు. ఫుట్‌బాల్ ఆడుకోవడానికి యూనివర్సిటీకి వచ్చి, యూనివర్సిటీలోని 400 ఎకరాల భూములపై కన్నేసి, నేడు ఆ భూములను వేలం ద్వారా అమ్మటాన్ని నిరసిస్తూ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి విద్యార్థులు నిర్వహిస్తున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న చిన్నారులు ఈ సందర్భంగా మాట్లాడుతూ నెమలి మన జాతీయ పక్షి అని, అటువంటి నెమలికి గూడు లేకుండా చేయవద్దని, అమాయక పక్షులు ,దుప్పులు, జింకలు చనిపోతున్నాయని, వేరువేరు రాష్ట్రాల నుంచి వచ్చి విద్యార్థినీ విద్యార్థులు ఇక్కడ చదువుతున్నారని అటువంటి యూనివర్శిటీకి, మన రాష్ట్రానికి చెడ్డపేరు తీసుకురావద్దని, భవిష్యత్తు తరాల చదువులకు ఉపయోగపడే ఆ స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారుల కోసం అమ్ముకోవద్దని విజ్ఞప్తి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

# సింగరేణి సిఎండిని కలిసిన సైలో బంకర్ బాధితులు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని కిష్టారం, జలగం వెంగళరావు ఉపరితల గనులను సోమవారం సందర్శించిన సింగరేణి చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం (ఆర్.ఎస్.ఐ) ను కిష్టారం సైలో బంకర్ బాదితులు సోమవారం కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్పందించిన బలరాం నాయక్ మాట్లాడుతూ స్థానిక శాసన సభ్యురాలు, జిల్లా మంత్రులతో చర్చించి త్వరలో బాదితుల సమక్షంలో ఉన్నత స్థాయి సమావేశం ఏర్పాటు చేసి, బాధితులను ఆదుకునే దిశగా అడుగులు వేస్తామన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కడారి మదీనా, మారోజు నాగేశ్వరరావు, పాలకుర్తి నాగేశ్వర రావు, పాలకుర్తి ప్రభాకర్ (మణి బాబు), వాడపల్లి సుందర్ రావు, పాలకుర్తి వెంకటేశ్వరరావు, వేము సందీప్, బరగడ నరేంద్ర, వాడపల్లి నాగమణి, అరుణ, కొత్త లక్ష్మి, రామాల నాగమణి, పాలకుర్తి సత్యనారాయణ, మారోజు మారేశ్వరరావు, కొక్కెర గడ్డ నగేష్ తదితరులున్నారు.

# ఎస్ఎస్ వీల్ కేర్ ప్రారంభించిన మేయర్



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని పాండురంగాపురంలో నూతనంగా ఏర్పా టు చేసిన ఎస్ఎస్ వీల్ కేర్‌ను మేయర్ పునుకొల్లు నీరజ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్ల వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించి వారి మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఎస్ఎస్ వీల్ కేర్ నందు కారుకు సంబంధించి అన్ని రకాల సర్వీసులు, కారు ఉపకరణాలు అందుబాటులో ఉన్నాయని వాటిని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ డివిజన్ కార్పొరేటర్ మలీదు వెంకటేశ్వర్లు, నల్లమల వెంకటేశ్వరరావు, పోట్ల వీరేందర్ పాల్గొన్నారు.

# ఉమ్మడి జిల్లాలో తెగ తాగేశారు..

**-వైరా మద్యం డిపోలో రూ 2290.50 కోట్లు మద్యం అమ్మకాలు**

**-2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు అమ్మకాలు**




**ప్రజాపక్షం/ఖమ్మం :** వైరా మద్యం డిపోనందు 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 ఆర్థిక సంవత్సరానికి రూ 2290 కోట్ల 51 లక్షల మద్యం అమ్మకాలు జరిగాయి. గతంతో పోల్చుకుంటే ఈ ఆర్థిక సంవత్సరంలో మద్యం అమ్మకాలు భారీగా పెరిగాయి. 29,38,191 వేల మద్యం లిక్కర్ కేసులు, 1900704 కేసుల బీర్లు అమ్మకాలు జరిగాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున అమ్మకాలు జరగడంతో ప్రభుత్వానికి భారీగా ఆదాయం పెరిగింది. పండుగలు, ఫంక్షన్‌లకు తెగతాగేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వైరా మద్యం డిపోకు మద్యం అమ్మకాల్లో ప్రత్యేక గుర్తింపు వచ్చినట్లు సమాచారం.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాలు ఆపలేరు



**ప్రజాపక్షం/ మధిర :** అక్రమ అరెస్టులతో పోరాటాలను ఆపలేరని, ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై సిపిఎం పార్టీ ప్రజల తరుపున నిరంతరం ఉద్యమాలు నిర్వహిస్తుందని సిపిఎం పార్టీ జిల్లాకమిటీ సభ్యులు శీలం నర్సింహారావు అన్నారు. హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలం ప్రభుత్వం విరమించుకోవాలని నిరసనలు చేస్తున్న యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా హైద్రాబాద్‌కు వెళ్తున్న సిపిఎం నాయకులను స్థానిక పోలీసులు మంగళవారం ముందస్తు అరెస్టు చేశారు. ఈసందర్భంగా శీలం నర్సింహారావు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను వేలం వేయటం విరమించుకోవాలని, భూములను ప్రభుత్వం ఆధీనంలో ఉంచుకుని ప్రభుత్వ అవసరాల కోసం ఉపయోగించాలి తప్పా ప్రభుత్వం వాటిని వేలం వేసి అప్పగించటం సరైన పద్ధతి కాదన్నారు. ఇప్పటికైనా యూనివర్సిటీ భూములను అమ్మటాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన పాటు పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, టౌన్ కమిటీ సభ్యులు పాపినేని రామనర్సయ్య, వడ్రాణపు మధు తదితరులు ఉన్నారు.

# కూరాకులను పరామర్శించిన లింగాల



**ప్రజాపక్షం/ మధిర :** డిసిసిబి మాజీచైర్మన్ కూరాకుల నాగభూషణం సత్తుపల్లి వెళ్తున్న కారు అదుపు తప్పి ప్రమాదానికి గురై కారు లో ప్రయాణిస్తున్న నాగభూ షణం, అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న మాజీజెడ్పి చైర్మన్, మధిర నియోజకవర్గ బిఆర్ఎస్ ఇన్‌చార్జి లింగాల కమల్‌రాజు మంగళవారం వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. అనంతరం వారి యోగక్షేమాలను తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ రాజ్యం అంటే విద్యార్థుల హక్కులను కాలరాయడమేనా..?

**ప్రజాపక్షం/కరకగూడెం:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీకి చెందిన 400 ఏకరాల భూములను వేలం వేయాలని తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా యూనివర్సిటీ విద్యార్థులు పోరాడుతుంటే వారిని అక్రమంగా వీధి రౌడీల లాగా లాక్కొని వెళ్ళి అరెస్ట్ చేయడం తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న సిగ్గుమాలిన చర్య అని ఎస్ఎఫ్ఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహాయ కార్యదర్శి మాదాసు అఖిల్ అన్నారు. వేల కోట్ల విలువైన హెచ్. సి.యు భూములను కార్పోరేట్ శక్తులకు దారదత్తం చేసేందుకై రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కార్ కుట్ర పన్నుతోందని అన్నారు. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేయాలని, హెచ్. సి.యు భూములను యూనివర్సిటీ పేరుతో రిజిస్ట్రేషన్ చేయాలని లేకపోతే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటువంటి చర్యలతో విద్యార్థులు చేస్తున్న ఉద్యమాలను ఆపలేరని ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ విద్యార్థులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/మణుగూరు:** అవకతవకలు లేకుండా లబ్ధిదారులకు సన్న బియ్యం ప్రజలకు అందజేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండలం సమితి సింగారం గ్రామపంచాయతీ పరిధిలోని 9వ నెంబర్ రేషన్ షాప్ నందు తెలంగాణ రాష్ట్రం ప్రభుత్వం చేపట్టిన ఉచిత సన్న బియ్యం పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా విచ్చేసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించి, స్వయంగా లబ్ధిదారులకు బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు ఎమ్మార్వో రాఘవ రెడ్డి, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పిరినకి నవీన్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తరుణ్ రెడ్డి, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళ నాయకులు, యువజన నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటిద్దాం



**ప్రజాపక్షం/మణుగూరు:** ఎండ ఎక్కువగా ఉన్న రోజుల్లో గొడుగు తప్పనిసరిగా వాడాలి. వదులైన తెల్లని లేదా లేత రంగు కాటన్, నూలు వస్త్రాలు ధరించాలి. నెత్తిపై టోపి లేదా రుమాలు పెట్టుకోవాలి. ఎండ ఎక్కువగా ఉన్నప్పుడు నీరు ఎక్కువగా సేవించాలి. ఉప్పు కలిపిన మజ్జిగ /చిటికెడు ఉప్పు కలిపిన గ్లూకోజు నీరు/ఓరల్ రీహైడ్రేషన్ ద్రావణం త్రాగవచ్చును.

**వడదెబ్బ లక్షణాలు...**

తలనొప్పి, తల తిరగటం, తీవ్రమైన జ్వరం కలిగియుండటం, మత్తు నిద్ర, కలవరింతలు, ఫిట్స్, పాక్షిక లేదా పూర్తి అపస్మారక స్థితి.

**వడదెబ్బ తగిలితే చేసే ప్రథమ చికిత్స...**

వడదెబ్బకు గురైన వారిని శీతల ప్రాంతానికి వెంటనే చేర్చాలి. వడదెబ్బకు గురైన వారిని చల్లని నీటిలో ముంచిన తడిగుడ్డతో శరీరం అంతా తుడుస్తూ ఉండాలి. శరీర ఉష్ణోగ్రత 101 డిగ్రీల కంటే తక్కువ స్థాయికి వచ్చేవరకు ఈ విధంగా శరీరాన్ని తుడుస్తూ ఉండాలి. ఫ్యాను క్రింద ఉంచాలి. వడదెబ్బకు గురైన వారి ఆరోగ్య పరిస్థితిలో ఆశించిన మార్పు లేనిచో శీతల వాతావరణంలో దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించాలి.

## రాహుల్, సుస్మితలకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/తల్లాడ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాల్లో ఉద్యోగాలు సాధించిన వారికి తల్లాడ మండల బిజెపి అధ్యక్షులు చల్లా నాగులు ఆధ్వర్యంలో మంగళవారం సన్మానం చేశారు. ఈ సందర్భంగా గోపిశెట్టి సుస్మిత, చింతా రాహుల్‌ను ఆయన శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కృషి, పట్టుదల కఠోర శ్రమ ఉంటే ఏదైనా సాధించవచ్చునని తెలిపారు. ప్రతిఒక్కరూ వీరిని స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని, యువత ఉద్యోగాలు సాధించేందుకు కష్టపడి చదవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బాలాజీ నాయక్, రాయల రమేష్, ఉద్ధగిరి రామారావు, గొల్లమందల నరేష్, చౌడ నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దగ్గుల నాగి రెడ్డి, తుమ్మలపల్లి రమేష్, షేక్.యాకుబ్, పాషా తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అరెస్టు అప్రజాస్వామికం



**ప్రజాపక్షం/ తల్లాడ :** హైద్రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూమిని వేలం వేయటాన్ని నిరసిస్తూ గత కొన్ని రోజులు యూనివర్సిటీ విద్యార్థులు పోరాటం చేస్తున్నారని, పోరాటానికి నాయకత్వం వహించిన విద్యార్థిని, విద్యార్థులను అరెస్టు చేయటం అప్రజాస్వామికమని సిపిఎం పార్టీ సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన అని చెప్పి ఉద్యమాలపై గత ప్రభుత్వ పద్ధతినే కొనసాగిస్తుందన్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు మద్దతుగా నిలిచిన సిపిఎం పార్టీ నాయకులను అరెస్టు చేయటం హేయమైన చర్యఅని పేర్కొన్నారు. దీనికి నిరసనగా అన్ని మండల కేంద్రాల్లో, గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఇప్పటికైనా ప్రభుత్వం అరెస్టుచేసిన విద్యార్థులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పోరాడే సిపిఎంకు ప్రజలు మద్దతు తెలపాలని, భవిష్యత్ తరాల విద్యార్థుల ప్రయోజనాలు కాపాడుకోవడానికి నిరసనల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శివర్గ సభ్యులు అయినాల రామ లింగేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు నల్లమోతు మోహన్‌రావు, సేలం పకీరయ్య, మండల కమిటీ సభ్యులు షేక్.మస్తాన్ పాల్గొన్నారు.

# రాబోయే రోజులు ఎర్రజెండావే..



**- సిపిఐ నేతలు మొహమ్మద్ మౌలానా, దండి సురేష్**
**- అట్టహాసంగా మద్దుపల్లి గ్రామశాఖ మహాసభ**
**- ఏకగ్రీవంగా నూతన కమిటీల ఎన్నిక**







**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్పోరేట్ విధానాలపై నిస్వార్థంగా ప్రజలపక్షాన పోరాడే కమ్యూనిస్టులు చట్టసభల్లో ఉండాలని రాజకీయ విశ్లేషకులు, ప్రజలు ముక్తకంఠంతో కోరుకుంటున్నారని, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా, సిపిఐ జిల్లా సహాయకార్యదర్శి దండి సురేష్ అన్నారు. మంగళవారం ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని మద్దులపల్లిలో గ్రామశాఖ మహాసభను అట్టహాసంగా నిర్వహించారు. తొలుత మద్దులపల్లిగ్రామంలో, మహాసభ ప్రాంగాణం వద్ద ఏర్పాటు చేసిన అరుణ పతాకాలను మౌలానా, సురేష్ ఆవిష్కరించారు. అనంతరం శాఖ కార్యదర్శి రెంటాల శ్రీరాముల అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడారు...100సంవత్సరాల క్రితం భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించినప్పటికీ ఏనాడు అధికారం పదవుల కోసం వెంపర్లాడలేదన్నారు. కేవలం పేద ప్రజల పక్షాన ఎర్రజెండా చేతబట్టి నాటి నుంచి నేటి వరకు పోరాడుతూ అజరామరంగా నిలిచిందన్నారు. కార్మిక, కర్షకతో పాటు పలు చట్టాలు సిపిఐ పోరాట ఫలితంగానే వచ్చాయన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో లేకుండా బడా బాబులకే అందుబాటులో ఉన్న బ్యాంకులను ప్రైవేటీకరణ నుంచి జాతీయం చేయడంలో కమ్యూనిస్టుల పోరాటమే ఉందన్నారు. కమ్యూనిస్టులకు ఎంపీ, ఎమ్మెల్యే, ప్రజాప్రతినిధి, అధికారం అనే పదవులు అవసరం లేదని ఎర్రజెండా చేతబట్టి ప్రజల సమస్యలపై చేసే పోరాటమే అతి పెద్ద పదవి అన్నారు. ఈ సందర్భంగా మహాసభను నిర్వహించిన మద్దులపల్లిశాఖను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం సిపిఐశాఖ కమిటీతో పాటు ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, మహిళా సమాఖ్య నూతన కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, చెరుకుపల్లి భాస్కర్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, మండల సమితి సభ్యులు వెంపటి సురేందర్, దండి రంగారావు, తేలపూడి రాము, షేక్ జానీమియా, బానోత్ గడ్డ, పాల్తీయా శ్రీను, వెంపటి రాము, శాఖ నాయకులు కామేశ్వరరావు, ఆనంద్, వనపర్ల ఉపేందర్, కోతుల ప్రసాద్, ఉదారపు శ్రీను, బొల్లెద్దూ రాము, ఏఐవైఎఫ్ పాలేరు నియోజకవర్గ సహాయ కార్యదర్శి మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి, యువజ సంఘం సభ్యులు వనపర్ల సాయిమధు, శేషి, తోట గుణశేఖర్, మిరియాల నరుణ్‌తేజ్, అక్కినపల్లి దేవయ్య, రెబ్బగొండ గోపి తదితరులు పాల్గొన్నారు.

## జై బాపు, జై భీం, జై సంవిదాన్ యాత్రను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ యాత్రను విజయవంతం చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ తెలిపారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డి భవన్‌లో జరిగిన సమావేశంలో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బిజెపి నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, రాజ్యాంగ సూక్తులకు వ్యతిరేకంగా పనిచేస్తున్న తీరును ప్రజలకు వివరించాలనే సంకల్పంతో రాహుల్ గాంధీ ఆలోచనతో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈ యాత్రను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. అంబేద్కర్, మహాత్మ గాంధీ, స్వాతంత్ర్య సమరయోధుల పోరాట యోధుల కృషిని, త్యాగాన్ని ఈ యాత్రలో వివరించడం జరుగుతుందన్నారు. రాబోయే తరాలకు సువర్ణక్షరాలతో లిఖించబడిన వారి పేర్లు మనుగడ ఉండాలనే సంకల్పంతో ఈ యాత్రను చేపట్టిందన్నారు. ఈ యాత్ర ద్వారా పూర్తి స్థాయిలోకి అంబేద్కర్, గాంధీజీ ఐడియాలజీని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను, రాష్ట్రాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం ఏవిధంగా నాశనం చేసిందో, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులను ప్రజలకు వివరిస్తూ ఈ యాత్ర నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని ప్రతి మారుమూల గ్రామాల్లోనూ ఈ ప్రచారం జరగాలని తెలిపారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఖమ్మం నగరంలోని 18వ డివిజన్ శ్రీరామ్‌హిల్స్ నుండి ఈ యాత్ర ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ఈ యాత్రలో కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, బూత్ సంఘాల నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా ముక్తార్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, మందడపు లక్ష్మి మనోహర్, పాకాలపాటి విజయనిర్మల శేషగిరి, ఆళ్ల నిరీష అంజిరెడ్డి, చామకూరి వెంకటనారాయణ, అలియా, నాయకులు పాలకుర్తి నాగేశ్వరరావు, మదూరి సైదారావు, పాషా, నర్సింహారావు, పూర్ణ, చంద్రిక, గౌస్‌పాషా, భాస్కర్, శ్యామల, శివరామ్, రమేష్ పాల్గొన్నారు.

## ఆరు గ్యారెంటీలపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**ప్రజాపక్షం/పినపాక:** తెలంగాణలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై బిఆర్ఎస్ పార్టీ పినపాక మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏడూళ్లబయ్యారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు పగడాల సతీష్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల పేరుతో పేద ప్రజలను మోసం చేసిందన్నారు. హామీలు నెరవేర్చకుండా మాయ మాటలు చెప్తూ కాలం వెళ్లబుచ్చుతున్నారన్నారు. ఇప్పటికైనా పేద ప్రజలకు ఉపయోగం జరిగేలా వెంటనే హామీలు అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, ఏపీసీఎస్ ఛైర్మన్ రవి వర్మ, జిల్లా నాయకులు పొనుగోటి భద్రయ్య, ముఖ్య నాయకులు బుల్లిబాబు, కాయం శేఖర్, రాయల బాబు, పొనుగోటి కామేష్, ముక్కు నాసర్ రెడ్డి, బి చిన్నారి, వడ్లకొండ శ్రీను, బత్తుల వెంకటరెడ్డి, బాడిశ మహేష్, జి రామకృష్ణ, ఎగ్గడి సత్యం, ఎడ్ల కుమార్, రామయ్య, సిహెచ్ సాంబశివరావు, చెన్నకేశవులు, చిరంజీవి, దాసరి రవి, ఐలయ్య, రమేష్, కృష్ణ, శ్రీను, జాడీ కన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం

**-భూ సమస్యలు లేని గ్రామాలే మా లక్ష్యం**
**-రెవెన్యూ వ్యవస్థ బలోపేతం కోసమే జిపివోల నియామకం**
**-తెలంగాణ ఉద్యోగ జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి**




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకు వస్తున్న భూ భారతి చట్టంతోనే భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి అసలైన మార్గమని తెలంగాణ ఉద్యోగుల జేఏసి ఛైర్మన్ వి. లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం ఖమ్మం లోని ఎన్నెస్పి గెస్ట్‌హౌజ్‌లో గ్రామ రెవెన్యూ అధికారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు గరికె ఉపేంద్ర రావు సారథ్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర ఉద్యోగుల జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ భూ భారతి చట్టం సమర్థవంతంగా నిర్వహించడానికి ప్రభుత్వం 10,954 గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేసిందన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పూర్తి స్థాయిలో రెవెన్యూ శాఖను బలోపేతం చేయడానికి ప్రభుత్వం ముందడుగు వేస్తుందని ఆయన తెలిపారు. భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పాటు భూ భారతి చట్టం 2025తో రెవెన్యూ వ్యవస్థలో విప్లవాత్మక మార్పులకు తెలంగాణ ప్రభుత్వం నాంది పలికిందన్నారు. రాష్ట్రంలోని సుమారు 70 లక్షల మంది రైతులకు క్షేత్రస్థాయిలో సేవలు అందించేందుకు 10,954 గ్రామ పాలన అధికారుల పోస్టులను మంజూరు చేశారని తెలిపారు. పూర్వ విఆర్‌వోలు, విఆర్ఏలను మాతృ సంస్థలోకి తీసుకు రావడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన మాట నిలబెట్టుకుని వారి కుటుంబాలలో వెలుగులు నింపారన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 33 సెలక్షన్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ల పోస్టుల ఏర్పాటు తహసీల్దార్లు, ఆర్డీవోలు, జేసిలు కోల్పోయిన అధికారాలను భూ భారతి చట్టంతో పునరుద్ధరించుకున్నామని ఆయన తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన రెవెన్యూ శాఖను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చూపిస్తున్న చొరవకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జేఏసి ఉద్యమ ఫలితంగా స్పౌజ్, మెడికల్ తదితర కోణాల్లో ప్రభుత్వం బదిలీలు చేసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వ అండతో రాష్ట్ర ఉద్యోగ జేఏసి ఉద్యోగులకు అండగా నిలిచిందన్నారు. పదేళ్ల తర్వాత 330 మందిని అధికారికంగా అవుట్‌సోర్సింగ్ టైపిస్ట్ కం కంప్యూటర్ ఆపరేటర్లుగా నియామకం చేయడం, 670 మంది ఫీల్డ్ అండ్ టెక్నికల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేటు యాజమాన్యం నుండి ప్రభుత్వ కార్పోరేషన్‌కు బదిలీ చేయడం జరిగిందన్నారు. గరికె ఉపేంద్రరావు మాట్లాడుతూ గత చరిత్రలో ఎన్నడులేని విధంగా విఆర్‌వో, విఆర్ఏలను అర్థరాత్రి లాటరీ పద్ధతిలో వివిధ శాఖలకు గత ప్రభుత్వం బదిలీ చేసిందన్నారు. లచ్చిరెడ్డి సారథ్యంలో విఆర్‌వోలు, విఆర్ఏలు పూర్వ వైభవం సాధించుకున్నామన్నారు. విఆర్‌వోల ఆత్మ గౌరవాన్ని కాపాడిన ప్రజా ప్రభుత్వానికి, జేఏసి ఛైర్మన్ లచ్చిరెడ్డికి రుణపడి ఉంటామని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు డిఎస్ వెంకన్న, మంగీలాల్, సర్వే విభాగం ఉద్యోగ సంఘం నాయకులు బుచ్చయ్య, టిజిటిఏ ఖమ్మం, భద్రాద్రి జిల్లాల కన్వీనర్ కోట రవి కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ పాక, రాష్ట్ర సెక్రటరీ జనరల్ పుల్ సింగ్ చౌహాన్, కోశాధికారి శ్రీనివాసశంకర్‌రావు, రాష్ట్ర బాధ్యులు ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం, డిప్యూటీ సిఎంలపై కేసు నమోదు చేయాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఎన్నికలకు ముందు 100 రోజులోనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన సీఎం, డిప్యూటీ సీఎంలపై కేసు నమోదు చేయాలని బిఆర్ఎస్ పార్టీ బూర్గంపాడు మండల అధ్యక్షులు గోపిరెడ్డి రమణారెడ్డి అన్నారు. మంగళవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు ఆయన ఆధ్వర్యంలో ప్రజలను మోసం చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలపై కేసు నమోదు చేయాలని కోరుతూ బూర్గంపాడు పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ రాజేష్‌కి వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 రోజుల్లోనే ఆరు గ్యారెంటీలలో 13అంశాలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 16 నెలలు అయినా గ్యారెంటీల అమలు చేయలేక చేతు ఎత్తివేసిందని ఆరోపించారు. హామీలను అమలు చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలు సంతకాలతో కూడిన గ్యారెంటీ కార్డులను ప్రజలకు ఎరగా వేసి ఓట్లను దండుకున్నారని, హామీలను అమలు చేయగా పోగా, రైతులు సామాన్య ప్రజలను కష్టపెడుతున్నారని తెలిపారు. ఆరు గ్యారెంటీలను 100 రోజులలో అమలు చేస్తామని చెప్పి ప్రజలను మోసం చేసినందుకు వారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు సానికొమ్ము శంకర్‌రెడ్డి, సాధిక్ పాషా, బొల్లు సాంబశివరావు, కొనకంచి శ్రీను, వళదాసు సాలయ్య, కెవి రమణ, క్రి నాగేశ్వరరావు, రంజిత్, బానోత్ శ్రీను, బెజ్జంకి కనకచారి, సీతారాంనాయక్, చెక్క నర్సింహారావు, కోట జయ రాజు, తగిరస దుర్గ, భూక్య కృష్ణ, షైక్ బీకారి, సైయదు కీరం, వెంకటేశ్వర్లు, రంజిత్, గంగపురి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో అక్రమ అరెస్టులా..?




**ప్రజాపక్షం/ములకలపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అక్రమంగా వేలం వేస్తే చూస్తూ ఊరుకోబోమన డివైఎఫ్ఐ సీనియర్ నాయకులు నిమ్మల మధు, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు అనుముల సాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి విధానాన్ని నిరసిస్తూ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ముందు విద్యార్థి యువజన సంఘాలు పిలుపులో భాగంగా ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా తెల్లవారుజామున విద్యార్థి, యువజన సంఘాల నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సెంట్రల్ యూనివర్సిటీభూములను అన్యాక్రాంతం కాకుండా భూములను కాపాడుకోవాలని భూములను అమ్మకానికి పెడితే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రజా పాలన ప్రభుతకవంలో ఇకపై అక్రమ అరెస్టులు ఉండబోవని ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు స్వేచ్ఛ కల్పిస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా తెలిపారని ఇప్పుడు మాట తప్పిప్రజాపాలన ప్రభుత్వంలో విద్యార్థి. యువజన నాయకులను ప్రశ్నించే గొంతులను పోలీసుల అరెస్టులతో అణిచివేయాలని చూస్తే భయపడేది లేదని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సెంట్రల్ యూనివర్సిటీ భూముల పరిరక్షణకై భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల నాయకులు సాయి చరణ్, పండా రామ్‌చరణ్, కీసరి స్వాతి, సూర్య, తదితరులు పాల్గొన్నారు.

## సన్న బియ్యం పథకం ప్రారంభం



**ప్రజాపక్షం/గుండాల :** మండలంలో ఉన్న ఎనిమిది రేషన్ షాపుల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెల్లరేషన్‌కార్డ్ లబ్ధిదారులకు మంగళవారం సన్నబియ్యం పథకాన్ని దిగ్విజయంగా ప్రారంబించారు. దీనితో లబ్దిదారులు ఎంతో ఉత్సాహంగా రేషన్ షాపులవద్ద క్యూలైన్ కట్టి బియ్యం తీసుకున్నారు. మంగలవారం ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినం కావడంతో అధికారులు ఎవరు అందు బాటులో లేక పోవడంతో గ్రామ పుర ప్రముకులతో ఈ పథకం ప్రారంబించడం జరిగిందని జిసిసి సేల్స్‌మెన్స్ తెలిపారు.

## నేడు బూర్గంపాడు సంత, షాపుల బహిరంగ వేలం పాటలు

**ప్రజాపక్షం/బూర్గంపాడు:** నేడు బూర్గంపాడు గ్రామ పంచాయితీ బహిరంగ సంత వేలం పాట, గ్రామ పంచాయితీ 3 షాపులకు బహిరంగ వేతం పాట నిర్వహించడం జరుగుతుందని బూర్గంపాడు గ్రామ పంచాయితీ కార్యదర్శి బర్ల ప్రభాకర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని బూర్గంపాడు గ్రామ పంచాయితీ కార్యాలయం ఆవరణలో నేడు(బుధవారం) ఉదయం 10గంటలకు పంచాయితీ ప్రత్యేక అధికారి, తహసీల్దార్ ముజాహిద్ అధ్యక్షతన 202526 ఆర్థిక సంవత్సరానికి గాను వారం వారం నిర్వహించు సంత, గ్రామ పంచాయితీ 3 షాపులకు బహిరంగ వేలం పాటలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆసక్తి గల వారు పంచాయితీ నియమాలను పాటించాలని, గ్రామ పంచాయితీ నందు సంప్రదించాలని తెలిపారు.

## ఘనంగా నాను వర్ధంతి



**ప్రజాపక్షం/కారేపల్లి:** అధికార మదంతో గిరిజన, గిరిజనేతర పేదలపై పంచాయితీలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల పేరుతో ప్రజల దగ్గర లంచాలు గుంజి గ్రామంలో పేదలపై పెత్తనం చేస్తున్న పెత్తందారులకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలు ఫణంగా పెట్టిన మాలోత్ నాను అని సిపిఎం సింగరేణి మండల కార్యదర్శి కే నరేంద్ర కొనియాడారు. మంగళవారం సిపిఎం సీనియర్ నాయకులు, పోడుభూముల పోరాట యోధుడు మాలోత్ నాను 47వ వర్ధంతి చీమలపాడులో పార్టీ చీమలపాడు శాఖ కార్యదర్శి యనమనగండ్ల రవిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ వర్ధంతి సభలో మాలోతు నాను చిత్రపటానికి పార్టీ డివిజన్ కమిటీ సభ్యులు వజ్రా రామరావు పూలదండ వేశారు. పార్టీ సీనియర్ నాయకులు ఎర్రిపోతు భద్రయ్య జెండా ఆవిష్కరించారు. ఈ వర్ధంతి సభలో పార్టీ మండల కమిటీ సభ్యులు అజ్మీర శోభన్‌బాబు, జాబుమల్లయిగూడెం శాఖ కార్యదర్శి వల్లబోయిన కొండలరావు, సీనియర్ నాయకులు మన్యం బ్రహ్మయ్య, వాంకుడోత్ రామకోటి, నాను కుమారులు హనుమ, అరుణ్‌కుమార్ వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించండి




**ప్రజాపక్షం/కారేపల్లి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సీటీలో 400 ఎకరాల భూమిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా వేలం నిర్వహిస్తున్న దాన్ని నిరసిస్తూ సిపిఎం ఎస్ఎఫ్ఐ నాయకులను అరెస్టు చేయడాని వ్యతిరేకిస్తూ కారేపల్లి సిపిఎం మండల కమిటీ సభ్యులు అజ్మీర శోభన్ నిరసన తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని సంవత్సరాల నుండి ఆ భూములను ఏ పార్టీ అధికారంలో వచ్చిన ఆ భూములని వేలం వేసిన దాఖలాలు లేవని, ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆ భూములను అమ్మి రాష్ట్ర ప్రభుత్వాన్ని పాటిస్తానటం ఆయన అవివేకమని ఇప్పటికీ జెసిబిలో బుల్డోజర్లు నడిపిస్తూ ఆభూముల్లో ఉన్న వన్యప్రాణాల నిలువను చంపేస్తున్నారని, అటువంటి జంతువులను గ్రామీణ ప్రాంతాలలో చంపివేస్తే రకరకాల చట్టాల పేర్లతో కేసు పెట్టి వారిని జైలు పాటు చేస్తున్నారని ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి వన్య జీవరాసుల ప్రాణాలు తీస్తున్నారని రేవంత్‌రెడ్డిపై ఫారెస్ట్ ఆఫీసర్లను ఉపయోగించాలని అతనని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అట్టానే ఈ భూముల కొరకు ఉద్యమాలు నిర్వహిస్తున్న నాయకులను అరెస్టు చేయడం బాధాకరమని ప్రభుత్వ భూమిని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

## రాజీవ్ యువ వికాసం పథకం గడువు పొడిగింపు



**ప్రజాపక్షం/మణుగూరు:** రాజీవ్ యువ వికాసం పథకం గడువును ఈ నెల 5 నుండి 14వ తేదీ వరకు పొడిగించినట్లు, పినపాక యువత సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు ఈబీసీ/ఈడబ్ల్యూఎస్ వర్గాల యువతకు ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా అర్హులైన వారికి రూ. 50,000 నుండి రూ. 4,00,000 వరకు ఋణం లభిస్తుంది. సబ్సిడీ శాతం ఎంచుకున్న పథకంపై ఆధారపడి ఉంటుంది. ఈ పథకం ద్వారా రూ. 50,000 వరకు 100% సబ్సిడీ, రూ. 50,001 1,00,000 వరకు 90% సబ్సిడీ, రూ. 1,00,0012,00,000 వరకు 80% సబ్సిడీ, రూ. 2,00,0014,00,000 వరకు బలహీన వర్గాలకు 70%, ఇతరులకు 90% సబ్సిడీ కల్పిస్తారు. గ్రామీణ ప్రాంతాల వారికి వార్షిక ఆదాయం రూ. 1.5 లక్షలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 2 లక్షలు మించకూడదు. ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి రేషన్ కార్డు లేదా ఆదాయ ధృవీకరణ పత్రం తప్పనిసరి. అర్హత కలిగిన యువతీ యువకులు ఓబీఎంఎంఎస్ https://tgobmmsnew.cgg.gov.in పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం విజ్ఞప్తి చేశారు.

# నేటి తరానికి వెంకటలాలయ్య సేవలు తెలియాలి

**సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం**



**ప్రజాపక్షం/కొణిజర్ల :** యాసా వెంకటలాలయ్య గ్రామానికి చేసిన సేవలు నేటి తరానికి తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిపిఐ జాతీయసమితి సబ్యులు బాగం హేమంతురావు అన్నారు. మండల పరిదిలోని తనికెళ్లలో తనికెళ్ల గ్రామ ప్రథమ సర్పంచ్ యాసా వెంకటలాలయ్య 35వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత పార్టీ పతాకాన్ని మాజీ సర్పంచ్ గడల సీతారామయ్య ఆవిష్కరించగా తనికెళ్ల సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి యాసా వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో బాగం ముఖ్య అతిధిగా పాల్గొని ప్రసంగించారు. దళితులు గ్రామానికి దూరంగా ఉండటంతో పార్టీ నిర్ణయానికి కట్టుబడి రాష్ట్రీయప్రధాన రహదారిప్రక్కన గల 12 ఎకరాల వ్యవసాయభూమిని ఇండ్ల స్థలాలకు ఇచ్చిన ఘనత ఆయనదని పేర్కొన్నారు. తాగునీటికి ఇబ్బందిపడుతున్న రోజుల్లో తన సొంత డబ్బుతో వడ్డెరకాలనీ, గౌడ్‌బజార్, గొల్లబజార్, ఎస్సీ కాలనీయందు బావులు తవ్వించి నీటిఎద్దడిని తగ్గించిన వ్యక్తి అని కొనియాడారు. ఇప్పటికి ఆయన వర్ధంతికి కులమతాలకు అతీతంగా ఇంతమంది హాజరయ్యారంటే ఆయనకు ప్రజల్లో ఉన్న స్థానమేంటో అర్ధం చేసుకోవచ్చని అన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతు నాడు నిస్వార్ధంగా పార్టీకి వారు వేసిన పునాదులే ఈరోజుకి పార్టీకి ఆదరణ ఉందని అన్నారు. విద్యాభివృద్ధికోసం విశాలమైన స్థలాలను విద్యాశాఖకు అప్పగించారని అధికారంలో లేకున్నా ఈగ్రామంలో సుమారు వంద ఎకరాల ఇండ్లస్థలాలను పంచిపెట్టిన ఘనత కమ్యూనిస్టుపార్టీకే దక్కిందని అన్నారు. కమ్యూనిస్టులు ఉనికిలేకపోతే పేదప్రజలకు న్యాయం జరగదని ప్రశ్నించేవారు లేకుండా పోతున్నారని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని కమ్యూనిస్టు నాయకులు చెప్పడం కాదు బూర్జువాపార్టీల మేధావులు సైతం దీన్ని అంగీకరిస్తున్నారని తెలిపారు. చుట్టుప్రక్కల గ్రామాలకు బలమైన కేంద్రంగా తనికెళ్ల ఉండేదని వచ్చే పంచాయతీ ఎన్నికల్లో తిరిగి ఎర్రజెండాను గెలిపించడంద్వారా ఇలాంటి నాయకులకు నిజమైన నివాళి అర్పిద్దామని స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు యర్రా బాబు, దొండపాటి రమష్, తాటి వెంకటేశ్వర్లు, పివిరావు, ఉపాధ్యాయసంఘం నాయకులు లేడిబోయిన గోపాల్‌రావు, విశ్రాంత ఉపాధ్యాయుడు కొణపర్తి విష్ణుమూర్తి, బాణోత్ భరత్, గడల శ్రీను, పిన్నం పుల్లయ్య, పాపిట్ల ఏసు, కవిడ వీరభద్రం, వెంకటలాలయ్య కుమారులు యాసా వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, రవి తదితరులు పాల్గొన్నారు.

# భూ కబ్జా కేసులో నలుగురికి రిమాండ్









**- పోలీస్ విచారణలో విస్తుపోయే నిజాలు**
**- నిందితులపై లోతుగా విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగులోకి..**

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** తప్పుడు వ్యవహారాలకు పాల్పడి.. రెవిన్యూ, పోలీసులను పక్కదారి పట్టించాలని చూసిన భూ కబ్జాదారులు ఎట్టకేలకు రిమాండ్ అయ్యారు. కులాన్ని కబ్జాకు వాడుకుని...అధికారులపైనే చేద్దామనుకున్న అడ్డగోలు భాగోతం కాస్తా.. పోలీసులు జరిపిన విచారణలో అసలు నిజాలు వెలుగులోకి వచ్చి మంగళవారం కటకటల పాలయ్యారు. వివరాలలోకి వెళితే...ఏదులాపురం మున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌కు చెందిన మెట్టు అరుణకు ఏదులాపురం రెవిన్యూ పరిధిలోని బైపాస్‌రోడ్ పక్కన ఫ్లాట్ ఉంది. ఆ ఫ్లాట్‌ను ఏదులాపురం గ్రామానికి చెందిన ఏపూరి శ్రీహరి, ఏపూరి శివ అలియాస్ ప్రతాప్, వడ్లకుంట భుజంగరావు, సతానుగూడేనికి చెందిన ఇనుపనూరి చంద్రశేఖర్‌లు మార్చి 16వ తేదీన కబ్జాకు యత్నించి దౌర్జన్యంకు పాల్పడ్డారు. దీంతో వారిపై బాధితులు ఫిర్యాదు చేయగా..పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రెవిన్యూ అధికారులతో పూర్తి స్థాయి పరిశీలన చేపించగా..నిందితులు కబ్జాకు యత్నించినట్టు రిపోర్ట్ ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేసి 308(5), 329(3), 324(4), 296 (బి), 351(2), ఆర్‌డబ్ల్యు 3(5) ఆఫ్ బీఎస్ఎస్ యాక్ట్ 2023 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి నలుగురిని రిమాండ్‌కు తరలించారు.

**విచారణలో విస్తుపోయే నిజాలు...**

మెట్టు అరుణకు ఏదులాపురం రెవిన్యూ సర్వే నెంబర్ 215లోని బైపాస్‌రోడ్డు పక్కన 363 గజాల ఫ్లాటు ఉంది. ఈ ఫ్లాటుపై అక్రమార్కుల కన్ను పడింది. ఎలాగైనా ఈ ఫ్లాటును కొట్టేయాలనే కుట్రకు తెరలేపారు. అందులో భాగంగా 217లో ఏపూరి రాములుకు లేని భూమిని ఉన్నట్టుగా రెవిన్యూ అధికారులను ఏమార్చి పాస్ పుస్తకం పొందారు. కానీ ఆ భూమి 2000సంవత్సరంలో బైపాస్‌రోడ్డు కింద మూడు కుంటలు పోగా..అందుకు ప్రభుత్వం నుంచి పరిహారం పొందారు. ఎలాగో అడ్డదారిలో పొందిన పాస్‌బుక్ ఉండటంతో కన్వర్షన్‌ను పొంది ఆ కాగితాలను అడ్డుపెట్టుకొని 215లో ఉన్న ఫ్లాట్‌ను కాజేసి కుట్రకు పాల్పడారు. ఈ వివాదంపై పోలీసులు విచారణ చేపట్టగా..రెవిన్యూ సిబ్బంది వచ్చి సర్వే చేసి ఆ ఫ్లాట్ 215లోనే ఉందని,217కాదని రిపోర్టు ఇచ్చారు. అలాగే అసలు 217లో ఏపూరి రాములకు భూమే లేదని రిపోర్ట్‌ను పోలీసులకు రిపోర్ట్ ఇచ్చారు. దీంతో నిందులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. భూ కబ్జాకు పాల్పడడమే కాకుండా ఇలా పోలీసులను, రెవిన్యూను పక్కదోవ పట్టించడానికి ప్రయత్నించి చివరకు అభాసుపాలయ్యారు. సదరు వ్యక్తులు గతంలో పలువురి భూమిపై తమ భూమేనని దౌర్జన్యంగా వ్యవహారాలు కనబరిచారు. ఇందులో భాగంగా పలు తప్పుడు పనులు చేశారని పోలీసుల లోతుగా విచారణ జరిపితే మరిన్ని విషయాలు వెలుగోలకి వచ్చే అవకాశం ఉంది.

# అమ్మ కోరిక తీర్చాడు..

**గ్రూప్ 1 సాధించిన విద్యార్ధి తాటి ప్రమోద్ సాయి**






**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అమ్మకు తన కొడుకు సివిల్ సర్వెంట్ కావాలని కోరిక. గ్రూప్1సాధించి అమ్మ కోరిక నెరవేర్చాడు కొడుకు ప్రమోద్ సాయి. సత్తుపల్లి పట్టణంలో విద్యాభ్యాసం చేసిన విద్యార్ధి తాటి ప్రమోద్ సాయి గ్రూప్1 పోస్ట్ సాధించాడు. మండల పరిధిలో గల కాకర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ టీచర్ గా పని చేస్తున్న తాటి సుదర్శనమ్మ పెద్ద కుమారుడే ప్రమోద్ సాయి. రెండో కుమారుడు ప్రదీప్ చంద్ర. వీరి స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లోని తాటి సుబ్బన్న గూడెం కాగా విద్యాభ్యాసం సత్తుపల్లి లోనే కొనసాగింది. ప్రమోద్ సాయి విద్యాభ్యాసం సత్తుపల్లి లోని వి.వి. విద్యాలయంలో జరిగింది. ఇంజనీరింగ్ విద్య హైదరాబాద్ వి.యన్.ఆర్.విజ్ఞాన జ్యోతిలో పూర్తి చేశారు. తండ్రి తాటి రామచంద్రరావు పిల్లలు చిన్న వయసులో ఉన్నపుడే చనిపోవడంతో అమ్మ సంరక్షణలో పెరిగారు. ఇటీవల ప్రకటించిన గ్రూప్1 ఫలితాలలో 464 మార్కులు (హాల్ టికెట్ నెంబర్240916327) సాధించాడు. రాష్ట్ర ర్యాంకు 317 కాగా యస్.టి. (ఆదివాసి కోయ ) సామాజిక వర్గంలో జోన్1లో 10 వ ర్యాంకు సాధించారు. గ్రూప్1 పరీక్షలకు ఎటువంటి కోచింగ్ తీసుకోకుండా తాను ఇంటి వద్ద స్వయంగా తయారైనట్లు ప్రమోద్ సాయి చెప్పారు. ఢిల్లీ లోని వాజిరం కోచింగ్ సెంటర్ లో ఐఏయస్ శిక్షణ తీసుకుంటున్న సమయంలో 2018లో ఏక్సిడెంట్ కారణంగా తీవ్ర గాయాలయ్యాయి. 6 సంవత్సరాల విలువైన కాలాన్ని ఆసుపత్రిలో వైద్య చికిత్స కారణంగా కోల్పోయానని, అయినప్పటికీ ఆత్మ విశ్వాసం కోల్పోకుండా తనకు తాను ధైర్యం చెప్పుకుంటూ అమ్మ ప్రోత్సాహంతో చదివి మెయిన్స్ కు క్వాలిఫై అయ్యానని తెలిపారు. నేను సివిల్ సర్వెంట్ కావాలన్నది అమ్మ కల. గ్రూప్ 1 సాధించి అమ్మ కలను నెరవేర్చాను.

# ఆక్రమణకు గురైన రోడ్డు పరిష్కారానికి కలిసి రావాలి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రం నడిబొడ్డున గ్రామంలో ఉన్న పీఆర్ సీసీ రోడ్డును స్థానిక కాంట్రాక్టర్ ముక్తార్ పాషా ఆక్రమించిన విషయం అందరికీ తెలిసిందేనని కాంగ్రెస్ మండల అధ్యక్షులు రామ నరసయ్య అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వీళ్ళు నిర్మించి ప్రజల రోడ్డును ఆక్రమించడంతో కాంగ్రెస్ పార్టీ వాస్తవాలతో తీర్పు చెప్పడంతో ముక్తార్ పాషా ఆదివాసి నాయకులను, తుడుం దెబ్బ నాయకులను అడ్డం పెట్టుకొని కాంగ్రెస్ పార్టీపై అసత్య ప్రచారాలు చేయడం, ప్రజలకు అవసరమైన రోడ్డు ఆక్రమించుకోవడం పత్రికల్లో ప్రకటనలు చేయడం దురదృష్టకరమన్నారు. ఆక్రమణకు గురైన రోడ్డు సమస్య పరిష్కారానికి మూడో తారీఖు గురువారం మండల కేంద్రంలోని ప్రజా సమక్షంలో వాస్తవంగా రోడ్డు ఉన్నదా లేదా అనేది స్థానిక ప్రజలే నిర్ణయితలుగా చెప్పాలని పార్టీలకతీతంగా కులమాతలకు అతీతంగా స్థానిక ప్రజలందరూ తప్పక హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ సమ్మయ్య, ముత్తిలింగం మహమ్మద్ అతహర్, శ్రీనివాస్, బుర్ర వెంకన్న, సుధాకర్ పాల్గొన్నారు.

# సన్న బియ్యం పేద ప్రజలకు వరం



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాష్ట్ర ప్రభుత్వం అందించే సన్న బియ్యం పేద ప్రజలకు వరములాంటిదని లబ్దిదారులు అన్నారు. మండల పరిధిలోని రేపల్లెవాడ, గానుగపాడు, రాయకంపాడు, చంద్రుగొండ, పోకలగూడెం, కుర్రాయిగూడెం తదితర గ్రామాల్లో సన్న బియ్యం పథకాన్ని ఆయా చౌక దుకాణాల్లో అర్హులైన లబ్దిదారులకు అందజేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలలో సన్న బియ్యం ఇస్తుందని తెలపడం జరిగిందని, నేడు దొడ్డు బియ్యం బదులుగా సన్న బియ్యాన్ని పంపిణీకి శ్రీకారం చుట్టిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన వాగ్దానాలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో దింపిందన్నారు. అయినా ముఖ్యమంత్రి పథకాలు అన్నిటిని విడదత వారీగా అమలు చేస్తున్నారన్నారు. రేపల్లెవాడలో తొలుత డ్వాక్రా మహిళలకు సన్న బియ్యాన్ని డీలర్ వాసం శ్రీను అందజేశారు. అదే విధంగా రాయకంపాడులో సన్న బియ్యం పథకాన్ని కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు భోగినబోయిన కోటేశ్వరరావు అందజేశారు. ఈకార్యక్రమంలో గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# దళితబంధు నిధులు దుర్వినియోగం



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం దళిత బంధు నిధులు సర్వే చేసి నిధులు దుర్వినియోగం చేసి ఉంటే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాల మహానాడు మండల అధ్యక్షులు బడుగు వీరస్వామి డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడు మండల పరిధిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దళితులు వ్యాపారాలు చేస్తూ వారి కాళ్లపై వారు నిలబడి అభివృద్ధి చెందాలంటూ దళిత బంధు పథకం ప్రవేశపెట్టి ఒక్కొక్క దళిత కుటుంబానికి యూనిట్ ద్వారా 10 లక్షలు ఇవ్వటం జరిగిందని, అదే క్రమంలో మండల పరిధిలో కొంతమంది దళితులకు పథకం ఇవ్వగా పథకంలో ఉన్నటువంటి యూనిట్లకు వారు వస్తువులు తీసుకొని వెహికల్స్ షాప్‌లు, ఎవరికి వారు షాప్‌లను ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న క్రమంలో తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల రాగా ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం అత్యధిక సీట్లు గెలుపొంది అధికారం చేజిక్కించుకోగా ఇదే అదను అనుకొని కొందరు దళితులు అధికార పార్టీలోకి వెళితే మేము నిధులను దుర్వినియోగం చేసిన మమ్మల్ని అడిగే వారు ఉండరు అని అధికార పార్టీలోకి వెళ్లి షాప్‌లను మూసివేసి వెహికల్స్ ను అమ్మకాలు జరిపి ఏమీ తెలియని వారిలాగా మాకు ఏమీ ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందలేదు అనేలాగా వ్యవహరిస్తున్నారన్నారు. కావున తక్షణమే రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం దళిత బంధు నిధులు దుర్వినియోగం పై క్షేత్రస్థాయిలో సర్వే చేసి, దళిత బంధు నిధులు దుర్వినియోగం అయి ఉంటే తక్షణమే దళిత బంధు నిధులను దుర్వినియోగం చేసిన దళితులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు.

# గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయండి



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** ఏప్రిల్ 5 న నారాయణపేటలో జరిగే తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ (టియూసిఐ అనుబంధం) రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ జిల్లా కార్యదర్శి ఏదులాపురం గోపాలరావు కోరారు. మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో పోస్టర్లను ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (టియూసిఐ అనుబంధం) గ్రామపంచాయతీ కార్మికులకు అండగా నిలిచి, వాళ్లు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు అన్ని రకాల సెలవులు అమలు చేయాలని కోరారు. నెలల తరబడి జీతాలు ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి తగదని అన్నారు. ప్రతి నెలా ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా గ్రామపంచాయతీ కార్మికులకు కూడా నెల నెలా వేతనాలు వ్యక్తిగత అకౌంట్లో జమ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి ధన్వంతరావు, నాయకులు వినోద్, లచ్మీ హనుమంతరావు పాల్గొన్నారు.

# తాగునీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టండి

### కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** వేసవి ఎండలు తీవ్రరూపం దాలుస్తున్న పరిస్థితిలో గ్రామీణ ప్రాంతాలు, పట్టణ ప్రాంతాల్లో తాగు నీటి ఎద్దడి నివారణకు పటిష్టమైన చెర్యలు చేపట్టాలని కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొత్తగూడెం, పాల్వంచ మున్సిపల్, పబ్లిక్ హెల్త్, భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, గ్రిడ్ అధికారులతో మంగళవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ, ప్రతిపాదనలో ఉన్న మంచినీటి పథకాలు, బోర్లు, పైప్ లైన్లను తక్షణమే పూర్తి చేసి ప్రజలు అందుబాటులోకి తేవాలని, మరమ్మతులకు గురైన బోర్లు, పైప్ లైన్లను, మంచినీటి ట్యాంకులకు తక్షణమే మరమత్తులు చేయాలనీ ఆదేశించారు. ఎక్కడ తాగునీటి సమస్య ఉన్నా అధికారులు స్పందించి పరిస్కారానికి చర్యలు తీసుకోవాలని, తాగునీటి సమస్య పరిస్కారానికి కావాల్సిన నిధులు కేటాయించే విషయంలో తొలి ప్రాధాన్యత ఇస్తానని, ఎన్ని నిధులైనా కేటాయించేందుకు వెనుకాడేది లేదన్నారు. నీటి సమస్య పరిస్కారంకోసం నియోజకవర్గానికి మంజూరైన రూ.1.90కోట్ల నిధులకు సంబందించిన పనులు తక్షణమే ప్రారంభించాలని త్వరితగతిన పూర్తి చేయాలనీ సూచించారు. నీటి పథకాలకు కావాల్సిన నిధుల ప్రతిపాదనలు తక్షణమీ అందించాలని సూచించారు. మంచినీటి సమస్యపై ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందినా అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని, విధులపట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమీక్షలో మున్సిపల్ కమిషనర్ సుజాత, పబ్లిక్ హెల్త్ డి ఈ శ్రీనివాస్, మిషన్ భగీరథ డ్ ఈ సాయి, ఆర్ డబ్ల్యూఎస్, ఎస్‌డీఈ శివయ్య, మున్సిపల్ డిఈ రవి కుమార్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన మ్యూజియం సంస్కృతీ సంప్రదాయాలకు తలమానికం

### కలెక్టర్ జితేష్ వి పాటిల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఐటిడిఏ ప్రాంగణంలో ఏర్పాటు చేస్తున్న గిరిజన మ్యూజియం గిరిజన సంస్కృతి సాంప్రదాయాలకు తలమానికంగా మారనుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మంగళవారం ఐటిడిఏ ప్రాంగణంలో నిర్మాణం అవుతున్న గిరిజన మ్యూజియాన్ని ఐటిడిఏ పిఓ రాహుల్, ఏఎస్పి రోహిత్ రాజ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన పూర్వికుల సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, అడవి తల్లి ఒడిలో సాగిపోయిన జీవనం విధానం నేటి గిరిజన యువతకు అవగాహన కల్పించేందుకు అక్కడి మ్యూజియాన్ని రూపొందించడం అభినందనీయం అన్నారు. ఏర్పాట్లు, కళాకండాలు ఆకట్టుకునే విధంగా ఉన్నాయి. మట్టితో నిర్మించిన ఇల్లు ఎంతో ఆందగా ఉన్నాయని చెప్పారు. ఖండాంతరాలకు ఈ సంస్కృతి సంప్రదాయాలను తెలిపే విధంగా రూపొందించడం జిల్లాకే గర్వకారణం అన్నారు. శ్రీరామ నవమి, పట్టాభిషేక మహోత్సవాలకు వచ్చే భక్తులు గిరిజన మ్యూజియాన్ని కూడా వీక్షించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. అనంతరం పిఓ మాట్లాడుతూ సందర్శకులను ఆకట్టుకునే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. చిన్న పిల్లలకు బోటింగ్, క్రీడా స్థలం, ఆహారపు స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దీనిని టూరిజం స్పాట్‌గా చేసేందుకు కసరత్తు చేస్తున్నామని, ఇక్కడ ఎటువంటి కల్తీలేని గిరిజన వంటకాలు రూచి చూపించేందుకు కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పి విక్రాంత్ కుమార్ సింగ్, ఏపిఓ డేవిడ్ రాజ్, తహశిల్దార్ శ్రీనివాస్, ఐటిడిఏ యూనిట్ల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హామీలను నెరవేర్చనందుకు కేసు నమోదు చేయాలి

**ప్రజాపక్షం/ఆళ్లపల్లి :** ఎన్నికలలో అమలు కానీ హామీలు ఇచ్చి, హామీలను నెరవేర్చనందుకు కేసు నమోదు చేయాలని బిఆర్ఎస్ మండల అధ్యక్షులు పాయం నరసింహారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, కేంద్ర బిఆర్ఎస్ పార్టీ పిలుపు మేరకు మంగళవారం ఆళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఆనాడు పిసిసి ప్రెసిడెంట్‌గా ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అమలు గాని 6 గ్యారంటీ కార్డుల మీద సంతకాలు పెట్టి...ప్రజలకు పంచి వంద రోజుల్లో హామీలు నెరవేరుస్తామని హామీ ఇచ్చి 15 నెలలు గడుస్తున్నా హామీల అమలు చేయడంలో విఫలమయయారని, ప్రజల్ని మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కపై కేసు నమోదు చేయాలని ఆళ్లపల్లి బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్‌లో దరఖాస్తు చేశారు. ఈకార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి షేక్ బాబా, మండల ఉపాధ్యక్షులు కొమరం వెంకటేశ్వర్లు, ఉకే భద్రం, ప్రచార కార్యదర్శులు గుమ్మడి నరసింహారావు, నరేడ్ల ప్రవీణ్, కోశాధికారి యండి అదమ్, కోపరేటివ్ ఛైర్మన్ గొగ్గేల రామయ్య, మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవి, మాజీ



జెడ్‌పిటిసి కొమరం హనుమంతరావు, మాజీ కార్యదర్శి సయ్యద్ ఆరిఫ్, మాజీ సర్పంచులు కొమరం శంకర్ బాబు, పాయం వెంకట్ నారాయణ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు వేమూరి రాంబాబు, మండల నాయకులు గొగ్గేల లక్ష్మయ్య, తాటి నాగేశ్వరరావు, గొగ్గేల పాపారావు, కిషోర్ బాబు, సుధాకర్, బాబురావు, బాబు, ఊకే రామయ్య, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులను ఖండించండి

**ప్రజాపక్షం/కూసుమంచి :** సిపిఎం కార్యకర్తలను అరెస్ట్ చేయడానికి ఆ పార్టీ మండల కమిటీ తీవ్రంగా ఖండించింది వివరాల్లోకి వస్తే హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ హెచ్‌సియు భూములను రక్షించాలని చెప్పి సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమానికి వెళుతున్నటువంటి వారిని ముందస్తు అరెస్టులు చేయడం అనేది కాంగ్రెస్ ప్రభుత్వం అపజాస్వామ్య పాలన కొనసాగించడమే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోనికి రాగానే ఇచ్చిన ఆరు గ్యారెంటీలతో పాటు ఏడవ గ్యారెంటీగా ప్రజా పాలన కొనసాగిస్తామని చెప్పడం జరిగింది. ఇచ్చిన మాటను తప్పి దుర్మార్గంగా ప్రజాస్వామిక పాలన




కొనసాగిస్తా ఉంది. ప్రజల యొక్క కనీస సమస్యలను చెప్పుకోవడానికి వీలు లేని విధంగా ముందస్తు అరెస్టులు చేస్తూ ఫోన్లు చేసి నాయకులను పిలిపించడం పోలీస్ స్టేషన్లో కూర్చోబెట్టడం అనైతిక చర్యగా భావిస్తూ మంగళవారం కూసుమంచి మండల పోలీస్ స్టేషన్ లో కూసుమంచి సిపిఐయం మండల నాయకులు మండల కార్యదర్శి తోటకూరి రాజశేఖర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు ఎడవల్లి రమణారెడ్డి, బిక్కసాని గంగాధర్, మూడు గన్యా నాయక్, మండల కమిటీ సభ్యులు చీర్ల రాధాకృష్ణ, జగదీష్ లను అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

# రాముల వారి కళ్యాణానికి బియ్యం వితరణ




**ప్రజాపక్షం/భద్రాచలం :** జేడి ఫౌండేషన్, ఏఐడి ఇండియా ఫౌండేషన్ (అమెరిక) వారి సహకారంతో శ్రీ సీతారాముల వారి కళ్యాణానికి బియ్యం వితరణ చేశారు. ఇందులో భాగంగా మంగళవారం 5 క్వింటాళ్ల బియ్యాన్ని దేవస్థానం ఇఓ ఎల్ రమాదేవికి అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ దేవస్థానానికి బియ్యం అందించడం అభినందనీయమన్నారు. జేడి ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు నలుదిక్కులు సాగుతున్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో హన్సి, సునీత, నాగరాజు, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా గ్రామాలలో వచ్చేది వేసవి కాలం కావడం, పొలం పనులు పూర్తి కావస్తుండటంతో గ్రామీణ అభివృద్ధి శాఖాధికారులు ఉపాధి పనులపై దృష్టి సారించారు. ముందుగా చింతలబయ్యారం, గడ్డంపల్లి, పొట్లపల్లి పలు గ్రామాలలో ఉపాధి పనులు ప్రారంభమయ్యాయి. మరో వారం రోజుల్లో ప్రతి గ్రామాల్లో ఉపాధి హామీ పనులు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఎంత మందికి పని కల్పించాలి, ఏయే పనులు చేపట్టాలని అంశంపై అధికారులు ప్రణాళికలు చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మిగిలిన పనులతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలో చేపట్టే పనుల్లో పెద్ద ఎత్తున కూలీలు పాల్గొనే అవకాశం ఉండటంతో అధికారులు అందుకు తగు ఏర్పాటు చేయనున్నారు. ఈకార్యక్రమంలో పొనగంటి శ్రీను, మాజీ ఎంపీటీసీ పొనగంటి శివకృష్ణ, జింక నర్సిమ్మ, సంతోషి, గుండారపు ఏడుకొండలు, రవి, రాము, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

# సన్న బియ్యం పథకం పేదలకు వరం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** సన్న బియ్యం పథకం పేదలకు వరంలాంటిందని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు పేర్కోన్నారు. మంగళవారం మండలం లోని పలు గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన సన్న బియ్యం పథకం ను ప్రారంభించారు. తొలుత సీఎం చిత్ర పటంతో పాటు మంత్రులు చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. మండలం లోని ఆయా గ్రామాలలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇందిరమ్మ కమిటి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, నాయకులు శాఖమూరి రమేష్, నెల్లూరి భద్రయ్య, బచ్చలకూరి నాగరాజు, బోయిన వేణు, జెర్రిపోతులు అంజిని, కడియాల నరేష్, ధీరావత్ రాధా కృష్ణమూర్తి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీదేవి వసంత నవరాత్రోత్సవాలు



**ప్రజాపక్షం / పాల్వంచ :** మండల పరిధి కేపీ, జగన్నాధపురం గ్రామంలో వెలసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో మార్చి 30న ప్రారంభమైన శ్రీ అమ్మ వారి వసంత నవరాత్రోత్సవాలలో భాగంగా 3వ రోజు మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నాదనీరాజనం, శ్రీచక్రార్చన, సూర్యనమస్కారములు, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ సూక్త పారాయణ, చండీసప్తశతీ పారాయణం, హోమములు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి మహానివేదన, మల్లెపూలతో లక్షకుసుమార్చన, శ్రీ లలితాసహస్రనామహవనము నిర్వహించారు. సాయంత్రం నీరాజన మంత్రపుష్పం, ప్రసాదాలు వితరణ చేశారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి వారికి పంచామృతాభిషేకం, ఆకు పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు, దేవస్థాన అర్చకులు, ఋత్వికులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్థానిక రైతుల ధాన్యం కొనుగోలు చేయాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని రాజేశ్వరపురంలోని రైస్ మిల్లు స్థానిక రైతుల ధాన్యంను కొనుగోలు చేయాలని రైతులు మిల్లు యాజమాన్యంను కోరారు. మంగళవారం స్థానిక రైస్ మిల్లులో రైతులు కలిసి సమస్యలను వివరించారు. స్థానికంగా మిల్లు ఉండి కూడ ఎకరం పంట పొలం పండించిన రైతులు కూడ కోదాడ సుధూర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మిల్లు పరిధిలోని రాజేశ్వరపురం, అమ్మగూడెం, మోటాపురం, శంకరగిరితండా, కట్టుకొమ్మ తండా తదితర గ్రామాలకు చెందిన రైతుల ధాన్యం ను వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజేశ్వరపురం మాజీ సర్పంచ్ దండా పుల్లయ్య తో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

# కార్మికుల సొంతింటి కల నెరవేర్చండి

**సింగరేణి ప్రధాన కార్యాలయంలో సంస్థ సిఏండి బలరాంతో భేటీ అయిన ఎమ్మెల్యే కూనంనేని**



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** సంస్థ అభివృద్ధికోసం అహర్నిశలు శ్రమిస్తున్న కార్మికుల సొంతింటి కల నెరవేర్చేవిదంగా చర్యలు చేపట్టాలని, అదే విధంగా సంస్థకు సేవ చేసి పదవి విరమణ పొందిన కార్మికులు నివసిస్తున్న క్వార్టర్లను పూర్తిస్థాయిలో కేటాయించి గృహవసతి కల్పించాలని కొత్తగూడెం శాసనసభ సభ్యులు, గుర్తింపు సంఘం గౌరవ అధ్యక్షులు కూనంనేని సాంబశివరావు సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను కోరారు. సంస్థ ప్రధాల కార్యాలయంలో మంగళవారం సిఏండితో సమావేశమై కార్మికులు, మాజీ కార్మిక కుటుంబాలు, కోల్ బెల్ట్ ప్రాంతాల సంబందించిన పలు అంశాలను అయన దృష్టికి తీసుకెళ్లారు. తన ప్రతిపాదనలను లేఖల రూపంలో అధికారికి అందించారు. మూడుగంటలపాటు సుదీర్ఘంగా చర్చించిన అనంతరం కూనంనేని మాట్లాడుతూ సంస్థలో పనిచేసి పదవి విరమణ పొందిన కార్మికులకు నిలువ నీడలేని పరిస్థితులు నెలకొంటున్నాయని, కార్మికులకు సొంతింటి పథకాన్ని అమలు చేస్తామని గతంలో ఐటీయూసీతో జరిగిన ఒప్పందాన్ని సిఏండి చేశామన్నారు. కార్మికులు పదవి విరమణ పొందిన అనంతరం వారు నివసిస్తున్న క్వార్టర్లను వారికి కేటాయించి యాజమాన్య హక్కు కల్పించాలని కోరామని తెలిపారు. పోస్టాఫీసు సెంటర్ నుంచి హేమచంద్రాపురం ఉన్న రోడ్డు బొగ్గు లారీల రాకపోకల వాళ్ళ పూర్తిగా శిధిలమైందని, తరచు ప్రమాదాలు చోటుచుకుంటున్నందున ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించి, డివైడర్తోపాటు సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలనీ అదేవిధంగా బస్టాండు సెంటర్ నుంచి త్రిమాత టెంపుల్ వరకు ఉన్న రోడ్డును కూడా విస్తరించి డివైడర్లు ఏర్పాటు చేసే సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలని కోరామన్నారు. కొత్తగూడెం ప్రాంతంలో 17 కమ్యూనిటీ హాళ్లు నిర్మించేందుకు ప్రతిపాదించామని అందుకు కావాల్సిన స్థలాలని యాజమాన్యం కేటాయించాలని, కొత్తగూడెం, రామవరం ప్రాంతాల్లో వున్నా కమ్యూనిటీ హాళ్లను ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేయాలనీ కోరామన్నారు. ఎంజి రోడ్డులోని సంస్థకు చెందిన షాపింగ్ కాంప్లెక్సును ఆధునిక పద్దతిలో నిర్మాణం చేయాలనీ, ఇక్కడి ప్రజల అవసరాల దృష్ట్యా సంస్థ ఆధ్వర్యంలో మల్టిప్లక్సు నిర్మాణం చేపట్టాలని కోరామన్నారు. త్వరలో ప్రారంభం కానున్న వికె ఉపరితల గని నిర్వహణను సంగరేణి యాజమాన్యమే చేపట్టేవిధంగా చర్యలు తీసుకోవాలని, ప్రేవేటు సంస్థలకు అప్పగిస్తే అడ్డుకుంటామని సిఏండికి తెలిపామన్నారు. తమ ప్రతిపాదనలపై సిఏండి సానుకూలంగా స్పందించారని, త్వరలో వీటి అమలుకు యాజమాన్యం చర్యలు చేపడుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. కూనంనేని వెంట సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.రాజ్ కుమార్, నాయకులు కె.సారయ్య, వట్టికొండ మల్లికార్జున్ రావు, ఎస్వి రమణమూర్తి, సందె బోయిన శ్రీనివాస్, సింగరేణి డైరెక్టర్ పా వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్లు రాధాకృష్ణ, రాజేశ్వర్ రావు, సూర్యనారాయణ తదితరులు వున్నారు.

# సన్నబియ్యం పేదలకు వరం : కూనంనేని





**ప్రజాపక్షం/సుజాతనగర్:** రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సన్న బియ్యం ప్రజలకు గొప్ప వరం అని కొత్తగూడెం శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావు అన్నారు. మంగళవారం మండలంలోని నాయకులగూడెం గ్రామంలో రేషన్ షాప్ వద్ద పేదలకు సన్న బియ్యం పంపిణీ పథకం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు 500 రూపాయలు బోనస్ అందించడం వలన సన్న బియ్యం ఎక్కువగా పండిస్తారు అన్నారు. ప్రభుత్వం చేయవలసిన పనులు ఇంకా చేయాల్సి ఉందని, ప్రజా సమస్యలపై ప్రజల కోసం మాట్లాడుతున్నామన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా సగటు 5000 రూపాయలు పోయిన కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా పరిశ్రమలు ఏర్పడతాయని, భూమి విలువ పెరుగుతుందని, ఉపాధి తిరుగుతుందని, మెప్మా వల్ల పనులు దొరుకుతాయని, అన్ని విధాల మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. సుజాతనగర్ లో రెవెన్యూ ఎంపీడీవో కార్యాలయాల అలానే ఉంటాయన్నారు. దానితోపాటు మున్సిపల్ కార్యాలయం కూడా ఉంటుందన్నారు. జూపార్కు 250 ఎకరాలలో ఏర్పాటు కోసం కృషి చేస్తున్నామన్నారు. 500 కోట్ల రూపాయలతో అని శెట్టిపల్లి, సర్వారం, మంగపేట, రామవరం, పాల్వంచ మీదుగా రింగ్ రోడ్ ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. సుజాతనగర్ లో జూనియర్ కాలేజ్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె సాబీర్ పాషా, సొసైటీ చైర్మన్ మండే హనుమంతరావు, డిఎస్ఓ రుక్మిణి దేవి, తహశీల్దార్ గుడి చుట్టూ శిరీష, డిటి మహేష్, సిపిఐ మండల కార్యదర్శి భూక్య దశ్రు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కుమారి హనుమంతరావు, జక్కుల రాములు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాళ్లూరి పాపారావు, ఏఐటియుసి మండల అధ్యక్షులు వీర్ల మల్లేష్, సిపిఐ నాయకులు కుమారి కృష్ణ, వీర్ల దుర్గాప్రసాద్, బండి రమేష్, మూడు గణేష్, లావుడియా గోపి, దండు సురేష్, మేకల వెంకటేష్, రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు లావుడియా దేవసింగ్, డీలర్ చందర్, అధికారులు, సిపిఐ నాయకులు, రేషన్ డీలర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల పట్ల మోడీ మొండివైఖరి వీడాలి

**తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ దండు ఆదినారాయణ**



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఉపాధి హామీ పథకాన్ని నీరు గార్చి, దేశ వ్యాప్తంగా ఉన్న కొట్లాదిమంది కూలీల పొట్ట కొట్టేందుకు ప్రదాని నరేంద్ర మోడీ ప్రయత్నం చేస్తున్నారని, ఆ కుట్రలను తిప్పి కొట్టి, ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరు సిద్ధం కావాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదినారాయణ కూలీలకు పిలుపు నిచ్చారు. వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రామసభల్లో భాగంగా మండల పరిధిలోని గంగారం, బేతుపల్లి గ్రామాల్లో మంగళవారం జరిగిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఉపాధి హామీ పథకానికి 2007లో రూ.1,50,000 కోట్లు కేటాయింపులు జరిగితే, నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాధి హామీ పథకానికి బడ్జెట్లో నిధులు కోత పెట్టి కేవలం రూ80 వేల కోట్లు కేటాయించి వాటిని ఖర్చు పెట్టకుండా చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోడి కార్పొరేట్ సంస్థలకు, అదాని, అంబానీలకు వేల కోట్ల రాయితీలు ఇస్తున్నారని, ప్రభుత్వ ఉపాధి కూలీలకు రేట్లు పెంచేందుకు చేతులు రావడంలేదని మండిపడ్డారు. కూలీలకు రూ.7 కూలీ పెంచి, కూలీల పట్ల చవితి తల్లి ప్రేమ చూపుతున్నారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం నిర్వీర్యం చేసి కూలీలకు పని లేకుండా చేయటం కోసం, కూలీల పొట్ట కొట్టేందుకు మోడీ ప్రభుత్వం కుట్రలు సాగిస్తుందని, వ్యవసాయ కూలీల ఐక్యంగా కుట్రను తిప్పి కొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సంవత్సరానికి 200 రోజులు పనులు కల్పించి రోజు కూలి రూ. 600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదలకు ఇచ్చిన హామీలు భూమిలేని ప్రతి కూలీకి రూ.12,000 వెంటనే చెల్లించాలని, ఉపాధ్యాయులతో సంబంధం లేకుండా డబ్బులు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం బికేఎంయు నాయకులు గుంజ సత్యం, మహిళా సమాఖ్య సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి ఎస్కె రంజాన్ బి, యువజన సమైఖ్య కన్వీనర్ ఎస్ కే హమీద్, సీతారావమ్మ, మాజీ సర్పంచ్ నల్లంటి లక్ష్మి, అలివేలు, తాటి పొట్టయ్య, వెంకటేశ్వరమ్మ, సత్యవతి, మహాలక్ష్మి, సీతమ్మ, రాజ్యలక్ష్మి, కృష్ణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు




**ప్రజాపక్షం/పెనుబల్లి:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 ఎకరాల భూములను వేలం వేయటాన్ని నిరసిస్తూ హైదరాబాద్ వెళ్లటానికి బయలుదేరిన పెనుబల్లి మండల సిపిఎం కార్యకర్తలను అర్ధరాత్రి అరెస్టు చేయటం దుర్మార్గపు చర్య అని సిపిఎం మండల కార్యదర్శి గాయం తిరుపతిరావు అన్నారు. తెలంగాణ రాష్ట్రానికి విద్యార్థులకు విజ్ఞానాన్ని అందించేటటువంటి విలువైన హెచ్సీయూ యూనివర్సిటీ భూములను వేలం పెట్టడం అంటే తెలంగాణ విద్యార్థి లోకానికి తీవ్ర నష్టం అని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు జరిపే నిరసనకు సిపిఎం ఎస్ఎఫ్ఐ మద్దతు ప్రకటించగా, ఈ మద్దతుకు బయలుదేరిన సిపిఎం, ఎస్ ఎఫ్ఐ కార్యకర్తలను చిమట విశ్వనాథం, బెజవాడ సాయి శేషు, గుడిమెట్ల బాబు, కార్యకర్తలను ప్రభుత్వం అప్రజాస్వామికంగా అరెస్టులు చేసినంత మాత్రాన ఉద్యమాలను ఆపలేరని, ఇప్పటికైనా ప్రభుత్వం యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపి విద్యారంగాన్ని రక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ భూములను కాపాడటం కోసం తెలంగాణ ప్రజలందరూ ముక్త కంఠంతో ప్రభుత్వ విధానాన్ని వ్యతిరేకించాలని కోరారు.

# పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి




**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** మండల కేంద్రంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా మంగళవారం మండల పాస్టర్ల ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీని నిర్వహించారు. ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రైస్తవ మత బోధకుడు పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి పట్ల మండల పాస్టర్లు, సంఘస్తులు నిరసన వ్యక్తం చేస్తూ, తమ సంతాపాన్ని తెలిపారు. మండల పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు పరమ అశోక్ అధ్యక్షతన శాంతి ర్యాలీ నిర్వహించిన అనంతరం భగత్సింగ్ సెంటర్లో నిర్వహించిన సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మాజీ వైస్ ఎంపీపీ, అగ్నిమినిస్ట్రీ సంఘ నాయకులు రేసు ఎల్లయ్య, బిఆర్ఎస్ మాజీ ఎంపీపీ కొండ్రు మంజు భార్గవిలు పాల్గొని వారి సంతాపాన్ని తెలిపారు. అనంతరం ఎల్లయ్య, మంజు భార్గవి మాట్లాడుతూ పాస్టర్ ప్రవీణ్ పగడాల రాజమండ్రి ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన విషయం యావత్ క్రైస్తవ సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసిందని వారి మరణం అనేక అనుమానాలకు తావుతీస్తుందని, సమగ్ర విచారణ జరిపించి నిజాలు క్రైస్తవ లోకానికి వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. భారతదేశ ప్రజాస్వామ్య లౌకిక దేశమని ఇక్కడ ఎవరు ఏ మతాన్ని అయినా స్వీకరించవచ్చు, అలాగే ఎవరి మత బోధనలు వారు చేసుకోవచ్చు, ఎవరినైనా కించపరిచే విధంగా వ్యాఖ్యాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవాలి తప్ప హత్య చేసే హక్కు ఎవరిచ్చారని, మనకు న్యాయస్థానలు ఉన్నాయని, విధమైన హత్యల చర్యలు మంచివి కావని, ఇలాంటి వాటిని ప్రభుత్వాలు ప్రోత్సహించకూడదని, మతోన్మాదాన్ని అంతం చేయాలని, పాస్టర్ ప్రవీణ్ కుమార్ పగడాల మృతి పట్ల క్రైస్తవ సమాజం దిగ్భ్రాంతికి గురైందని, ప్రభుత్వాలు ఇట్టి మరణంపై సమగ్ర విచారణ చేసి, హత్య లేక ప్రమదామా, నివృత్తి చేయాల్సిన అవసరం ఉందని, అతని మృతి పట్ల కర్రలతో కొట్టినట్లు బాటు కాళ్ళతో కొట్టినట్లు గుర్తులు ఉన్నట్లు పరిశీలనలో తేలిందన్నారు. ఇలాంటి జరగకుండా ఒక వేళ అది హత్య అయితే నిందితులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో మండల ఫెలోషిప్ అధ్యక్షులు పరమ అశోక్, ఉపాధ్యక్షులు డెవిడ్, ట్రెజరర్ జాషువా, సెక్రటరీలు జాన్ విక్టర్, ఆంధ్రయ, జ్యోతిర్మయి యానిమేటర్, పరమ ప్రభాకర్, ప్రభుదాస్, ఆంధ్రయ్య, ఇమ్మానుయేలు, దానియేలు, కొర్నెలి, యోసేపు, రామూర్తి, కృపావతి, పాల్రాజ్, ప్రభాకర్, యాకోబు, అకుల, శ్రీనివాస్ పాల్, జాన్ బాబు, జాన్ విక్టర్, కొర్నేలి, సంఘస్తులు సుధాకర్, గాడుదలు దాసు, నిట్ట దిలీప్, తదితరులు పాల్గొన్నారు.

# సన్నబియ్యం పంపిణీ



**ప్రజాపక్షం/పెనుబల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రేషన్ షాపుల ద్వారా అమలు చేయబోతున్న సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సత్తుపల్లి శాసనసభ్యురాలు మట్టా రాగమయి దయానంద్ ప్రారంభించి, ముత్తగూడెంలో బియ్యం పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తుందని అన్నారు. అర్హులైన వారికి త్వరలో రేషన్ కార్డులు మంజూరు అవుతాయిని తెలిపారు. ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ నాయకులు మట్టా దయానంద్, గుడూరు మాధవరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారం అందించడమే ప్రభుత్వ లక్ష్యం



**ప్రజాపక్షం/భద్రాచలం :** ఇది ముమ్మాటికీ పేదల ప్రభుత్వమని, పేదలకు సరైన పౌష్టికాహారాన్ని అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్ఏ డా.తెల్లం వెంకట్రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆయన సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ పేదల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరోమారు నిరూపించారని చెప్పారు. ప్రజలు ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందని, ప్రజల అవసరాలను గుర్తించి తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.